క్లుప్తంగా

తల్లీబిడ్డ ఆరోగ్యానికి భరోసా

కోవెలకుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం తల్లీబిడ్డ ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రక్త హీనత, ఐరన్ లోప నివారణకు నెలకు సరిపడ కిలో రాగిపిండి, కిలో చిరుధాన్యాల పిండి, కిలో అటుకులు, పావుకిలో శనగ చిక్కీలు, పావుకిలో బెల్లం, పావుకిలో ఎండు కర్జూరాలతో కూడిన కిట్టును అందజేస్తున్నామన్నారు. అనంతరం జన్‌భాగీదారి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు వెంకటలక్ష్మి, సరస్వతీ, పుల్లమ్మ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నిరంజన్

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు సరఫరా చేయాలని ఇన్‌చార్జ్ ఏడీఏ నిరంజన్ సూచించారు. మంగళవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో కోవెలకుంట్ల మండలంలోని ఎరువులు, విత్తన దుకాణ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్తీలేని విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందజేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు రాణించాలి

బేతంచెర్ల: ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గోరుమాన్ కొండ సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూల్లోని విద్యార్థులు సాయి చరిత, శివ మనీష, దామోదర సాయి లకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా మెడల్స్, నగదు బహుమతులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అందజేశారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణంలోని రేగిమాను పేటకు చెందిన రేగిమాను సుభాష్ అనారోగ్యంతో మరణించారు. మంగళవారం రేగిమాన్ సుభాష్ కుటుంబ సభ్యులకు పాలిష్ కట్టర్ అసోసియేషన్ తరపున సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, పాలిస్ కట్టర్ అసోసియేషన్ కార్యదర్శి కోట్ల రమేష్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆలీబాబా, శాల్ బాషా, వెంకట రాముడు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలపై తనిఖీలు

కోవెలకుంట్ల: పట్టణంలోని పలు చోట్ల మంగళవారం పోలీసులు పెండింగ్ చలానాలపై తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్ తదితర రికార్డులు లేకుండా రాంగ్, నో పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపిన వాహనాలకు గతంలో పోలీసులు ఈ చలానాపేరుతో జరిమానా విధించారు. కొన్ని నెలలు గడుస్తున్నా చలానా చెల్లించకుండా కొందరు వాహన చోదకులు తప్పించుకుని తిరుగుతున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ రంగయ్య ఆధ్వర్యంలో పోలీసులు వివిధ ప్రాంతాలవైపు వెళ్తున్న వాహనాలను ఆపి చలానా వివరాలను పరిశీలించారు.

నేడు మెడికల్ క్యాంప్

డోన్ టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురష్కరించుకొని బుధవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డోన్ బ్రాంచి మేనేజర్ రాముడు అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలసీదారులు, ఎల్ఐసీ ఏజెంట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సామూహిక యోగాసనాల ప్రదర్శన: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురష్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సామూహిక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద వైద్యురాలు గ్రేస్ సెలెస్టియస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బనగానపల్లెరూరల్: ప్రతి రోజు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంత చేకూరుతుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవరావు చౌదరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం బాలగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మాధవరావు చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారిణి డాక్టర్ వాణి, ఉపాధ్యాయనులు నారాయణమ్మ, శ్రీగౌరి, జయసుధాబాయి, నాగమణి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితానికి రాజయోగం!

- మనిషి ఒత్తిడిని జయించే దివ్య ఔషధం యోగాసనం
- ప్రజలను చైతన్య పరుస్తున్న గీతాయోగాసన సంఘం
- సంఘంలో రెండొందల కుటుంబాలు సభ్యులు
- నేడే అంతర్జాతీయ యోగా దినోత్సవం



చక్రాసనం వేసిన దృశ్యం (ఫైల్)



మయూరాసనం వేసిన వృద్ధుడు (ఫైల్)

డోన్: శరీరంలో కోల్పోతున్న శక్తిని ఇనుమడింపజేసే అత్యుత్తమ సాధనం యోగాసనం. దైనందిక ఉరుకుల, పరుగుల జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లు, ఒత్తిళ్ల నుంచి మానవుడు తట్టుకుని నిలబడగలిగేందకు దివ్య ఔషధం యోగాసనం. ప్రస్తుతం ప్రజలు సైతం యోగాపై మక్కువ చూపుతున్నారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం. యోగా ప్రాముఖ్యతను చాటడంలో డోన్‌లోని గీతాయోగాసన సంఘం సత్ఫలితాల సాధించింది. దివంగత యోగసనాచార్యుడు సూరి రాఘవ దీక్షితులు 18–6–1983లో గీతా యోగాసన సంఘం ప్రారంభించారు. వంకదారి పెద్దన్న పర్యవేక్షణలో ఈ సంఘం దినదినాభివృద్ధి చెందింది. రెండు వందల కుటుంబాలు ఈ సంఘంలో సభ్యులు అయ్యారంటే యోగా ప్రాముఖ్యత అర్థమవుతుంది. గీతాయోగాసన వార్షికోత్సవం సందర్భంగా ఏటా వారో త్సవాలు నిర్వహిస్తుంది. ప్రజలను చైతన్య పరచడంతోపాటు సామాజిక కార్యక్రమాలు చేపడుతుంది. స్థానిక శ్రీసుధ హైస్కూల్‌లో యోగాసనాల ప్రదర్శనలు నిర్వహించిన సభ్యులు మొక్కలు నాటడం, ర్యాలీలు చేపట్టారు. ప్రత్యేకించి ప్రతియేటా వార్షికోత్సవం సందర్భంగా యోగా గురువులు, ప్రముఖులను ఆహ్వానించి యోగా ప్రాముఖ్యతను చాటుతున్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈయేడు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, గరకపాటి నరసింహారావు తనయుడు గరకపాటి గురుజాడ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసిన విషయం తెలిసిందే. డోన్‌ను పూర్వం పిలిచే ద్రోణాచలం పేరు ప్రాముఖ్యతను గరకపాటి గురుజాడ ఈ సందర్భంగా గుర్తు చేశారు. డోన్‌ను మరలా ద్రోణాచలంగా పేరు మార్చుకుంటే తన తండ్రి గరకపాటిని ఇక్కడకు తీసుకొచ్చి ప్రవచనాలు చెప్పిస్తానని గరకపాటి గురుజాడ హామీ ఇచ్చారు కూడా. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారీ ఏర్పాట్లు చేపడుతన్నారు గీతా యోగాసన సంఘం సభ్యులు. రక్తదాన శిబిరం, సామూహిక యోగాసనాల ప్రదర్శన నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

మానసిక ప్రశాంతత

అనేక శారీరక రుగ్మతల పరిష్కారానికి ఆనందకరమైన జీవన మార్గానికి దిక్సూచిగా నిలిచే యోగాసనాల పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. సంసార వికాసానికి, శారీరక దారుఢ్యానికి, మానసిక పరివర్తన, ప్రశాంతతకు చక్కటి మార్గంగా యోగాసనాలు పేరొందాయి.ప్రత్యేకించి డోన్ పట్టణంలో యోగాకు ప్రజలు చాలా ప్రాధాన్యతనిస్తున్నారు.

ఆనందంగా ఉంది



గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో యోగాసనాల సాధన చేయడం ఎంతో ఆత్మ సంతప్తి, ఆనందాన్ని కలిగిస్తోంది. వయసు పెరుగుతున్న కొద్దీ శారీరకంగా ధృడత్వాన్ని పొందిన అనుభూ తి కలుగుతోంది. ప్రతిఒక్కరూ యోగాసనాలను సాధన అలవరుచుకోవాలి.

– సంగాల సాయిబాబా, గీతాయోగాసన సంఘం సభ్యులు, డోన్

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధం



శారీరకంగా వ్యక్తపరిచే ఎలాంటి భంగిమనైనా ఆసనంగా పేర్కొన్నవచ్చు. మెదడుకు, శరీరానికి బలమైన బంధాన్ని ఏర్పరిచేది యోగాసనం అని నా ప్రగాఢ విశ్వాసం. మొత్తం 84 ఆసనాలలో కొన్నింటినైనా సాధన చేయగలిగితే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చు.

–కందిమల్ల రాంపుల్లయ్య, గీతా యోగాసన సంఘం వ్యవస్థాపకులు, డోన్

ఒత్తిడిని జయించవచ్చు



ఊపిరి ఉన్నంతవరకు శరీరం, మనసును ధృడత్వంగా... శక్తివంతంగా ఉంచుకోవాలి. శరీరంలో కోల్పోతున్న శక్తిని ఇనుమడింపజేసి పేరుకుపోయిన మలినాలను విసర్జింపజేసే సాధనమే యోగాసనం. ఒత్తిడిని జయించి సంపూర్ణ ఆరోగ్యవంతునిగా జీవించవచ్చు.

– నాగభూషణంరెడ్డి, న్యాయవాది, డోన్

యువకుడి మృతి

డోన్ టౌన్ : మండల పరిధిలోని ఓబులాపురం సమీపాన జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సునీల్ (22) కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సునీల్‌ను బెంగుళూరు నుంచి హైదరాబద్ వెళ్తున్న వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన నిందితుడి అరెస్టు

డోన్ టౌన్: చిన్నమల్కాపురం గ్రామంలో సోమవారం ఐదుగురు వ్యక్తులు అక్రమ కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా దాడులు నిర్వహించిన పోలీసుల నుంచి పారిపోయిన వలిసెల గ్రామానికి చెందిన బండారు రవిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సెబ్ సీఐ భీమలింగం మంగళవారం తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉండగా అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ఫర్టిలైజర్ షాప్‌ల తనిఖీ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్లలో ఫర్టిలైజర్ షాప్‌లను మంగళవారం ఏఓ సుధాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ షాపులో రూ.2,63,972 విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. సుంకలమ్మ ఫర్టిలైజర్ షాపులో రికార్డులు సరిగా లేకపోవడం, చట్టం పరిధిలో లేని పురుగు మందులను అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించిన ఏఓ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా భగవాన్ ట్రేడర్స్ షాప్‌లోనూ సరైన రికార్డులు లేనందున లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆకుమల్ల రైతుబరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అగ్రికల్చర్ సిబ్బంది నరేష్, మానస, బాషా తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ఆర్ఎస్ రంగాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: అర్హతనే ప్రామాణికంగా కుల మతాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీటీసీలు నాగశేషు, వెంకట సుబ్బ మ్మ పంచాయతీ కార్యదర్శులు కృష్ణమూర్తి, సుమలత సచివాలయ సిబ్బందితో కలిసి ఎంపీపీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అవ్వా, తాత నెలనెలా పింఛన్ వస్తుందా, అక్కా వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మబడి అందుతున్నాయా అని ఎంపీపీ ఆరా తీశారు. అదేవిధంగా రైతులతో మాట్లాడి రైతు భరోసా వస్తుందా అని అడిగి తెలుసుకున్నా రు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎంపీపీ అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆర్ఎస్ రంగాపురంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, నాడు –నేడు పనుల కింద ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేశామని వివరించారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని గ్రామస్తుల ను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య, బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, చిన్న మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమోతి, కిట్టన్న, క్రిష్టారెడ్డి, తిమ్మారెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, రామ నాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: జూలై 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే జగనన్న సురక్ష పథకాన్ని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేపట్టిన పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యేక్షంగా చూసి అధికారంలోకి రాగనే నవరత్నాలు పథకం ద్వారా సంక్షేమ పథకాలను రూపొందించి 98 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో కిందిస్థాయిలో ఉన్న సమస్యలు, లోపాలను తొలగించి పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టిందన్నారు. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు టీమ్‌గా ఏర్పడి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను సేకరించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పథకాల లబ్ధి చేకూరేలా చూడాలన్నారు.కొందరు తమ స్వార్థప్రయోజనలకు కోసం లేని సమస్యలను సృష్టించి, స్పందన కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ల వద్దకు తీసుకెళ్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటిని పచ్చ పత్రికలు పెద్దగా చూపిస్తూ చంద్రబాబుకు వత్తసు పలికేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు తిప్పికొట్టేందుకు జగనన్న సురక్ష పథకం ద్వారా అధికారులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లీ ఎక్కడి సమస్యలు, అక్కడే పరిష్కారించే విధంగా చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కాని సమస్యలను కారణాలను లబ్ధిదారులకు వివరించాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, బనగానపల్లె తహసీల్దార్లు పుష్పకుమారి, శ్రీనివాసులు, ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓలు విజయకుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండంనాగేశ్వరరెడ్డి,జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివరామ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల సచివాలయ మండల కన్వీనర్ లాయర్ మాధవరెడ్డి, మొలకరాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం విద్యా కానుక



పోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంజామల: పేద విద్యార్థులకు జగనన్న విద్యా కానుక వరం లాంటిదని సంజామల మండల ఎంపీపీ పోచా రమాదేవి అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ఎంఈఓ శివ జ్యోతి ఈశ్వరయ్య అధ్యక్షతన జేవీకే కిట్లను విద్యార్థులు ఎంపీపీ పంపిణీ చేసి మాట్లాడారు. పేదల విద్యాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిందని, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసుతులు కల్పించిందని వివరించారు. అనంతరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జయ ప్రవల్లిక, గురు సుచిత్, డి.హుసేన్బిలను ప్రోత్సాహక నగదు, మెడల్స్, ప్రశంస పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏవో విజయ్ కుమార్ రెడ్డి, ముక్కమల మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, విద్య కమిటీ చైర్మన్ లక్ష్మిదేవి, సీఆర్పీ హుస్సేన్ బాషా, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంజామల ఎంఈఓ–2గా ఈశ్వరయ్య

సంజామల:మండల విద్యాధికారి–2గా ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు. కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయినిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎంగా ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఎంఈఓ–2గా సంజామల మండలానికి బదిలీ అయ్యారు. ఎంఈఓ శివ జ్యోతికి ఆయన జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: పేద ప్రజల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అవుకు మండలం కాశీపురంలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గ్రా నాయకుడు అయ్యపురెడ్డి, రవీంద్రారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలును వివరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు కాటసాని అందజేశారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని పేదలు తమ దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, డీటీ ప్రసాద్ బాబు, ఏఓ అబ్దుల్ హక్, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుల్లారెడ్డి, నాయకులు తిరుమలేష్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, తొలిశన్న, శివకుమార్ రెడ్డి, దాసయ్య, మనోహర్, మనోజ్, పార్థసారథి రెడ్డి, చిన్న తొలసిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, గుర్రెడ్డి, పురుషోత్తంరెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న గుండం శేషిరెడ్డి

బనగానపల్లె: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొనేటి సుమలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గుండం శేషిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు అమరేష్, రమేష్‌చౌదరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామంలో ఉన్న జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి బనగానపల్లె రైల్వే స్టేషన్ వరకు రైల్వేలైన్ ఏర్పాటుకు రైతులు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని యనకండ్ల వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులతో ఆర్డీఓ సమావేశమయ్యారు. దాదాపు 50 ఎకరాలను రైతులు కోల్పోవాల్సి ఉంటుందని, మంచి ధర అందజేసి ఫ్యాక్టరీ యాజమాన్యం న్యాయం చేయాలని రైతులు కోరారు. స్పందించిన ఆర్డీఓ ఫ్యాక్టరీ ప్రతినిధులతో చర్చించి అన్నివిధాలుగా న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

చనుగొండ్లలో వ్యక్తిపై దాడి

అవుకు: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఒక వ్యక్తిపై పదిమంది దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. మగళవారం ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చనుగొండ్లకు చెందిన బైరెడ్డి చెన్నకేశవ రెడ్డి సోమవారం రాత్రి టాబ్లెట్స్ తెచ్చుకోవటం కోసం గ్రామంలోని బస్టాప్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో అక్కడే ఉన్న కంకర పద్మనాభరెడ్డి, వల్లపురెడ్డి రామిరెడ్డి, వల్లపురెడ్డి సుంకిరెడ్డి, కంకర శివరామిరెడ్డి, వల్లపురెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వల్లపురెడ్డి సందీప్ రెడ్డి, వల్లపురెడ్డి మహేశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సాల్మన్, నాగపుల్లయ్య అతనిపై దాడి చేశారు. పక్కనే ఉన్న కల్లంలోకి కొట్టుకుంటూ తీసుకెళ్లి చెట్టుకు కట్టేశారని, రాడ్లతో గాయపరిచారన్నారు. బాధితుడు బైరెడ్డి చెన్నకేశవ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇంత నిర్లక్ష్యం తగదు!

- ఎన్‌హెచ్ అధికారులపై చల్లా ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: జాతీయ రహదారుల అధికారులకు ఇంత నిర్లక్ష్యం తగదని, సమస్య ఉధృతం కాకమునుపే నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అవుకు మండలం గుండా ఉన్న జాతీయ రహదారి అధ్వానంగా ఉందని, ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా అవుకు పట్టణ సమీపంలో ఎన్‌హెచ్544డి మీదుగా ఉన్న కొత్త కాలువ కల్వర్టు పూర్తిగా దెబ్బతిందని, ఏ క్షణమైనా కుంగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అలాగే అవుకు పట్టణం నుంచి తాడిపత్రి వైపునకు సాయిబాబా ఆలయం మొదలుకొని ఊరి చివరి వరకు రహదారి మొత్తం పూర్తిగా దెబ్బతినిందన్నారు. రామాపురం గ్రామం ఊరిలోనే దాదాపు రెండ కిలోమీటర్ల మేరా రహదారి పూర్తి అస్తవ్యస్తంగా ఉందన్నారు. అవుకు పట్టణ సమీపంలోని మెట్టుపల్లె రహదారిలో ఉన్న పాలేరు బ్రిడ్జిపై నిర్మాణ పనులు సగభాగం చేసి వదిలేయడం ఏమిటని ఆర్ అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. ఈ సమస్యలను ఇప్పటికే చాలాసార్లు మండల మీట్‌లో ప్రస్తావించామని, అయినా ఎందుకీ నిర్లక్ష్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ అధికారి మాట్లాడుతూ ప్రసుత్తం ఎన్‌హెచ్ ఆధీనంలో ఉన్న ఈ రహదారి ఈ ఏడాది డిసెంబర్ నాటికి అంతా ఎన్‌హెచ్ఏఐ ఆధీనంలోకి వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈఈ సునీల్ రెడ్డి, డీటీ ప్రసాద్ బాబు, డాక్టర్లు వినోద్ కుమార్, భారతీదేవి, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఎన్‌హెచ్, ఎస్సార్బీసీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈలు ఫణి, ప్రసాద్, గౌస్, కరిముల్లా, ఎంఈఓ శ్రీధర్ రావు, వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

అవుకు: ఆటో డ్రైవర్లు అందరూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడుపాలని ఎస్ఐ నరేంద్ర కుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఆటో నడిపే ప్రతి వ్యక్తి లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ తదితర రికార్డులన్నీ తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలీసుల సూచనలు, మోటార్ నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

విత్తనాలు వేయొద్దు

డోన్ టౌన్: రైతులు తొందర పడొద్దని, వర్షాలు సమృద్ధిగా కురిసి పదను అయ్యాక విత్తనాలు వేయాలని ఏఓ అధికారి అబ్దుల్ షఫీ సూచించారు. మండలంలోని కొత్తకోట, దేవరబండ, యు.కొత్తపల్లె రైతు భరోసా కేంద్రాలను ఆయ న మంగళవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అర కోర పదనులో విత్తనం వేస్తే ప్రస్తుతం ఉన్న అధిక ఉష్ణోగ్రతలతో సరిగా మొలకెత్తవు అని చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపిన సీఎం



కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. స్థానిక పొదుపు భవనంలో కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో పాలాభిషేకం చేశారు. సీఎంతోపాటు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని గుర్తు చేశారు. ఉద్యోగ భద్రతలేని కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందాలు నింపారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామక్రి ష్టారెడ్డి, బనగానపల్లె అధ్యక్షులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంట్రాక్టు అధ్యాకుల సంఘం జిల్లా సెక్రటరీ కిశోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, పీఆర్‌టీయూ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.